

# మకిల

ఎం.వి.ఎస్.ఎస్. ప్రసాద్



"మీకు బి.పి. వచ్చిందండోయ్" అన్నాడు డాక్టరు నవ్వుతూ. ఆ మాట వినేసరికి నా మనసు అదోలా అయిపోయింది. పట్టుమని నలభై ఏళ్ళయినా లేని నాకు బి.పి. వచ్చిందనే సరికి నా మనస్సును బెంగ ఆవరించింది. యముడు విసిరిన తాడు పీకకు తగులుకుందనీ, ఇక బిగుసు కోవడమే తరువాయి అనిపించింది. డాక్టరు ఆ విషయం నవ్వుతూ చెప్పే సరికి నాకు నషాళానికి తగిలింది... అవును నాకు రోగమొస్తే ఆయనకు పండగే కదా. డాక్టరుకి ఒక కొత్త పేషెంటు దొరకడం, కారు పెట్రోలు బిల్లులో కొంత భాగం ఫ్రీగా రావడంతో సమానం. నెలనెలా చెకప్‌లు, టెస్టులూ

# కథ



ఏదో కాస్త తల తిరుగుతూ ఉందంటే జీలకర్ర, ధనియాలు కషాయం ఇవ్వకుండా, నా శ్రీమతి నన్ను బలవంతంగా డాక్టరు దగ్గరికి పంపించింది.

''కొన్ని మందులు రాస్తున్నాను. అవి క్రమం తప్పకుండా వేసుకోండి. ముఖ్యంగా ఆహార, విహార విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రోజూ వాకింగ్ చెయ్యాలి''

'వాకింగ్' అన్న మాట వినే సరికి నాకు గుండె ఆగినంత పని అయ్యింది. నా జీవితాంతం 'వాకింగ్' చేసే అవసరం రాకూడదు అన్న ప్రార్థనను భగవింతుడు ఆలకించలేదన్న మాట. నిజానికి అది నా వల్ల కాని పని.

డాక్టరు నా మనస్సులోని భావాలు గ్రహించినట్టు ఉన్నాడు. ''చూడండి మీరు తీసుకునే మందులకన్నా మీ మనసును అదుపులో పెట్టుకోవడం, వాకింగ్ చెయ్యడం లాంటివి చాలా ముఖ్యం. వీలైనంత వరకూ బండిని దూరంగా ఉంచి నడవడం అలవాటు చేసుకోండి'' అంటూ మందుల చీటీ నా చేతిలో పెట్టాడు డాక్టరు.

నేను మొహానికి నవ్వు పులుముకుని ''అలాగే డాక్టర్'' అన్నాను. క్లినిక్ బయటికి వచ్చి, ప్రక్కనే ఉన్న మందుల షాపులో మందులు కొనుక్కుని ఇంటిదారి పట్టాను.

వీధి గుమ్మంలోనే నా శ్రీమతి ఆతృతగా ఎదురు చూస్తూ నుంచింది. ''ఏమండీ డాక్టరుగారు ఏమన్నారు!!??'' అని ఆదుర్దాగా అడిగింది. ''ఆс! ఏదో కొద్దిగా బి.పి. ఉందన్నాడు. మాత్రలు రాసాడు''

''బీపీనా!!? అమ్మో!!?'' అంది శ్రీమతి అదేదో హార్ట్ ఎటాక్ అన్నంతగా.

కానీ ఆ

తరువాత ఆమె చెప్పిన జాగ్రతలూ, నేను ఆచరించవలిసిన ఆహార విహార నియమాలు చెప్పే సరికి నిజంగా నాకు హార్ట్ అటాక్ వచ్చినంత పని అయ్యింది. నాకు చెడ్డ రోజులు వచ్చాయనేది తేట తెల్లమయిపోయింది. ఆరోజు నుంచి ఇంట్లో చేసే పదార్థాలు తిని జిహ్వ చచ్చి పోయింది. అన్న హితవు ఆమడంత దూరం' పారి పోయింది.


కానీ అన్నింటి కన్నా పెద్ద సమస్య 'వాకింగ్' అయి కూర్చుంది. నా శ్రీమతి తెల్లవారు ఝూమున నాలుగు గంటల నుంచీ నాకు సుప్రభాతం పలికే కార్య క్రమంలో నిమగ్నమయిపోవడం మొదలుపెట్టింది. నేను ఆరుగంటలకి అతి కష్టం మీద వాకింగ్‌కి బయలుదేరినా అడుగులు తడబడుతున్నాయి. ఇంకా స్సేపు నిద్దురపోతే బాగుండననిపిస్తోంది. కానీ ఎక్కువగా శ్రీమతికి, కొంత డాక్టరుకి భయపడి పార్కులో వాకింగ్ చెయ్యడం మొదలుపెట్టాను. బలవం తంగా పార్కులో తిరుగుతున్నాను. ఆ పార్కుకి చాలా తక్కువ మంది వచ్చే వారు. అందుకని గొడవ, రభ లాంటివి లేకుండా ఉండేది.

కొంతకాలమయ్యే సరికి ఒక విషయం నా దృష్టికి వచ్చింది. రోజూ ఒక ముసలాయన, పద్దెనిమిది, ఇరవయి సంవత్సరాల అమ్మాయి కలిసి నడుస్తూ ఉండేవారు. వాళ్ళిద్దరూ తాత, మనుమరాలలా అనిపించలా. అసలు ఇద్దరి మధ్యా ఏ పోలికాలేదు. ఒక రోజు ఆ అమ్మాయి ఆయనను ''అంకుల్'' అని పిల వడంతో నా అభిప్రాయం సరైనదేనని తేలింది.

కానీ నాకు ఒక విషయం అర్థం కాలేదు. ఆ ముసలాయన ఆ చిన్నపిల్లతో నడవ డమేమిటి? తన వయస్సు వాళ్ళతో నడవవచ్చు కదా? ఇంకా అర్థం కాని విషయమే మిటంటే వాళ్ళిద్దరూ నవ్వుతూ, తుళ్ళుతూ జోకులు వేసుకుంటూ తిరగడం.

ఒక రోజు ఆయన ఆ అమ్మాయి నెత్తిమీద సుతారంగా మొట్టాడు. ఆ అమ్మాయి మెలికలు తిరిగిపోతూ, వగలుపోతూ ఆయన మీద పడి, పడి నవ్వ సాగింది. నాకు ఒంటి మీద తేళ్ళూ జెర్రులు ప్రాకినట్లయ్యింది. ఒకటి ఆ ఇద్దరూ ఆ పకపకలూ, ఇకిలూ ఏమిటని. రెండవది ఆయన స్థానంలో నేను లేనే అనే బాధ!!?? కానీ అలాంటి పిచ్చి ఆలోచనలు చేసానని తెలుస్తే నా శ్రీమతి నా నడుం విరగ్గొడుతుంది. దానితో జీవితాంతం ఏ వాకింగ్ చేయలేకుండా నా బ్రతుకు మంచం పాలవుతుంది.

రోజులు గడుస్తున్నాయి. రోజు రోజుకీ వాళ్ళ వ్యవహారం శృతి మించి పోతోందని అనిపిస్తోంది. నా అంతరాత్మ నన్ను నిలదీయడం మొదలుపెట్టింది. 'అసలు వాళ్ళ విషయం పట్టించుకోడానికి నువ్వెవరివి? ఆయన కొడుకువా? ఆ అమ్మాయి తండ్రివా?' అని ప్రశ్నించసాగింది... కానీ చూస్తూ, చూస్తూ ఒక మ్మాయి అలా.... ఎందుకో వాళ్ళ వ్యవహారం నాకు నచ్చలేదు. ఆ రోజు వాళ్ళి ద్దరూ మరీ బరితెగించినట్టుగా ఉంది. చెయ్యి చెయ్యి పట్టుకుని కబుర్లు చెప్పు కుంటూ నడుస్తున్నారు. వాళ్ళిద్దరూ అసలు ఈ లోకంలో ఉన్నట్టే లేదు. ఆయన ఆ అమ్మాయి బుగ్గలు చిదిమాడు. ఆ అమ్మాయి వగలు పోతూ సిగ్గుబడసా గింది. ఏమిటిది!!?? ఆ ముసలాయనకి అయితే బుద్ధి మందగించి ఉండవచ్చు.




అరవయిలో ఇరవయి అనుకుంటూ ఉండవచ్చు. ఆ అమ్మాయికైనా బుద్ధి ఉండ వద్దూ!? పెళ్ళి కావలిసిన పిల్ల... పోనీ ఎవడైన కుర్రాడితో చనువుగా ఉంటే అర్థ ముంది. మూలపడి ఉండవలసిన ముసలాయనతో ఆ వ్యవహారం ఏమిటి? ప్రేమ గుడ్డిది అంటారు. కానీ కామం అంతకన్నా గ్రుడ్డిది. ఆలోచించిన కొద్దీ నాకు బీ.పి. పెరిగిపోతోంది. 'ఛ ఎవరు ఎలా ఏడిస్తే నాకేం!?' అనుకున్నాను.

ఆ రోజు ఆదివారం. ఉదయం బద్ధకం అనిపించి వాకింగ్‌కి వెళ్ళలేదు. సాయంత్రం పార్క్‌కి బయలుదేరాను. అది శీతాకాలం కావడం వలన సన్నగా చలిగాలి ప్రారంభమయ్యింది. అప్పటికే చీకట్లు ముసురుకుంటున్నాయి. పార్కులో పెద్దగా లైట్లు లేవు. పార్కులో నేను తప్ప ఎవ్వరూ లేరు. మెల్లిగా నడవడం ప్రారంభించాను. అలా నడుస్తున్న నన్ను నేను చూసిన ఒక దృశ్యం కట్టిపడేసింది. మసకగా ఉన్న ఆ దృశ్యంలో నేను రోజూ చూసే ముసలాయన, ఆ అమ్మాయి అసభ్యకరమైన స్థితిలో ఉన్నారు. ఆ అమ్మాయి నేలమీద పడుకుని ఉంది. ఆ ముసలాయన ఆమె మీదకు వంగి ఆమె తలని తన చేత్తో పట్టుకుని ఆమె పెదాలను తన పెదాలను బిగించాడు. ''ఛీ!'' అప్రయత్నంగా బయటకే అన్నాను. కానీ వాళ్ళిద్దరూ నా మాటను పట్టించుకునే స్థితిలో ఉన్నట్లులేదు– అదీకాక బహుశా ఆ టైములో, చీకటి పడుతున్న వేళలో ఆ చలిలో ఎవ్వరూ పార్కుకి వస్తారని ఊహించి ఉండరు. ఆయనలో గానీ, ఆమెలో గానీ ఎటు వంటి చలనం లేదు. ముసలాయనకి బొత్తిగా బుద్ధిలేనట్లుంది. మనుమరాలు వయస్సుకల అమ్మాయితో బహిరంగంగా... కానీ ఆ అమ్మాయి... కనీసం ఎవ రైనా చూస్తారేమో ఏమయినా అనుకుంటారేమోనని... అయినా బరి తెగించిన వాళ్ళకు భయమేమిటి? నా పిచ్చికాకపోతే... ఛీ ఛీ లోకం ఎంత అసహ్యంగా మారిపోయింది. వయసు, వావి, వరుస మంచీ చెడూ అన్నీ వదిలేసినట్లుంది. నైతిక విలువలను తిలోదకాలు ఇచ్చేసింది. పదిమందికీ చెప్పవలసిన పెద్దవాడే ఇంత అసహ్యంగా ప్రవర్తిస్తూంటే... లోకంలో ఎంత మకిల నిండిపోయింది. కనీసం నాలాంటి వాళ్ళన్నా నడుంకట్టి ఏదో చేయాలి. చూస్తూ ఊరుకోకూడదు...

'బోయ్' మంటూ రోదచేసుకుంటూ వచ్చిన వాహనం నా ఆలోచనా సరళికి అడ్డుకట్ట వేసింది. వెనుకకి తిరిగి చూసే సరికి '108' వాహనంలోంచి స్ట్రెచర్ తీసుకుని ఇద్దరు పరిగెత్తుకుంటూ పార్కులోకి వచ్చారు. ఆ అమ్మాయిని మోసు కుని అంతే వేగంగా తిరిగి వాహనంలోకి వెళ్ళిపోయారు. అమ్మాయి తండ్రి కాబోలు అంతకంగారులోను ఆ ముసలాయనతో అన్నాడు ''థాంక్యూ సార్! మా అమ్మాయిని కాపాడారు'' అతని కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

''వెల్‌కమ్... మీరేమీ వర్రీకాకండి... షి విల్ బి ఆల్‌రైట్'' అని భరోసా ఇచ్చాడు ఆ పెద్దాయన. అమ్మాయి తండ్రి పరిగెట్టుకుంటూ వెళ్ళి ఎక్కగానే రయ్యిమని కదిలింది '108'

నాకేమీ అర్థం కాలేదు. ముసలాయన దగ్గరికి వెళ్ళి ఆత్మన్యూనతా భావంతో నుంచున్నాను.

''ఏమయ్యింది సార్!!??'' అని అడిగాను.

''పాపం ఆ అమ్మాయికేదో వింత జబ్బుటండీ. మెదడులో ఏదో లోపం ఉందట. అప్పుడప్పుడూ స్పృహ కోల్పోతూ ఉంటుంది. అమ్మాయి స్వచ్ఛమైన గాలిలో తిరుగుతూ ఉండడం మంచిదని డాక్టర్లు చెప్పారుట. చాలా కాలం తల్లో, తండ్రో తోడుగా ఉండి పార్కుకి తీసుకువచ్చేవారు. నేను వాళ్ళ ప్రక్క ఇంట్లోనే ఉంటాను. రిటైరైన వాడిని. ఈ మధ్య నేను వస్తున్నాను. అమ్మాయి సంతోషంగా, ఆనందంగా ఉంటే మామూలు అయ్యే అవకాశాలు ఎక్కువ అట. ఇందాక స్పృహ తప్పి పడిపోయింది. ఊపిరి తీసుకోడానికి కూడా కష్టపడింది.... మీరు వచ్చే సరికి నేను అమ్మాయికి ఆర్టిఫిషియల్ రెస్పిరేషన్ ఇస్తున్నాను. అంతకు ముందే సెల్ ఫోన్ ద్వారా '108'కి వాళ్ళ నాన్నగారికి ఫోన్ చేసాను.''

వజ్రం లాంటి మనిషిని గులక రాయిగా భావించి మహోన్నమైన అప రాధం చేసానని గ్రహించాను. సిగ్గుతో తలవంచుకున్నాను. తల భూమికి పైనే ఉన్నా, నా మనస్సు పాతాళంలోకి కుంగిపోయింది.

'మకిల' లోకంలో లేదు. నా మనస్సులో ఉందని గ్రహించాను. దానిని శుభ్రం చేసుకోవాలని ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాను.

*